క్లుప్తంగా

యాదాద్రి బస్సు సర్వీస్ ప్రారంభం వాయిదా

దుబ్బాకటౌన్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో దుబ్బాక నుంచి యాదాద్రికి వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీస్ ప్రారంభాన్ని వాయిదా వేస్తున్నట్లు డిపో ఇన్‌చార్జి మేనేజర్ సుఖేందర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కోడ్ అనంతరం బస్సు సర్వీస్‌ను పునరుద్ధరిస్తామని, ప్రయాణికులు గమనించాలని కోరారు.

సమయపాలన పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న శ్రీనివాస్

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ముస్త్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న జాతీయ, రాష్ట్ర, ఆరోగ్య కార్యక్రమాల పనితీరును పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్, వైద్య అధికారి మైమున, ఏఓ రవీందర్‌రెడ్డి, డానియల్ సీసీ ఉన్నారు.

970 మంది నిరుద్యోగులకు శిక్షణ

సిద్దిపేటకమాన్: కేంద్ర గ్రామీణ అభివృద్ధి సంస్థ 970మంది నిరుద్యోగులకు వివిధ రకాల శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు యూనియన్ బ్యాంక్ సోషల్ ఫౌండేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వివేక్‌కామత్ తెలిపారు. పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ భవనాన్ని ప్రాంతీయ అధికారి వికాస్‌తో కలిసి ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 183 నిరుద్యోగుల బ్యాచ్‌లకు శిక్షణ పూర్తిచేసినట్లు తెలిపారు. కుట్టు శిక్షణ, జూట్ వస్తువుల తయారీలో శిక్షణ పూర్తిచేసుకున్న 54మంది మహిళలకు ధ్రువపత్రాలు అందజేసినట్లు తెలిపారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యజిత్, డైరెక్టర్ రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిక్షణ ప్రారంభం



పేర్లు నమోదు చేయించుకుంటున్న కేడెట్లు

గజ్వేల్‌రూరల్: బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో సంగారెడ్డి బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ శిక్షణ శిబిరం ప్రారంభమైనట్లు కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ పీఎస్ నందా తెలిపారు. ఈ సందర్భంగా శనివారం శిక్షణ శిబిరంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ మధుసూదన్‌రావుతో కలిసి ఆయన మాట్లాడారు. జూన్ 1 నుంచి 10వ తేదీ వరకు ఈ శిబిరం కొనసాగుతుందని, మెదక్, నిజామాబాద్, సిద్దిపేట, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల నుంచి సుమారు 600మంది పాల్గొన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు, కేడెట్లు పాల్గొన్నారు.

డివిజన్ సాధనలో భాగస్వాములు కండి

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం చేపడుతున్న ఉద్యమంలో పార్టీలకు అతీతంగా కలిసి వచ్చి భాగస్వాములు కావాలని పలువురు జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేఏసీ, అఖిల పక్ష మాట్లాడుతూ చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం జరిగే పోరాటంలో పాల్గొనాలన్నారు. సమావేశంలో మల్లారెడ్డి, బీరన్న, వెంకట్‌మావో, ప్రశాంత్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగ జడ్జిలుగా సిద్దిపేట శిక్షకులు



సర్టిఫికెట్‌లు అందుకున్న మంజులారెడ్డి, కృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రస్థాయి యోగ జడ్జిలుగా జిల్లాకు చెందిన యోగా శిక్షకులు ఎంపికైనట్టు రాష్ట్ర అసోసియేషన్ టెక్నికల్ జాయింట్ సెక్రటరీ తోట సతీష్ శనివారం తెలిపారు. హైదరాబాద్‌లో శనివారం యోగ జడ్జిల ఎంపిక పరీక్షలు నిర్వహించారని, ఈ పరీక్షలో సిద్దిపేటకు చెందిన మంజులరెడ్డి, కృష్ణ న్యాయమూర్తులుగా ఎంపికయ్యారని, వారికి సర్టిఫికెట్‌లు అందించినట్లు తెలిపారు. రాంరెడ్డి, తోట అశోక్, నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారన్నారు.

• నాచగిరి.. భక్తజన సందడి

సుప్రసిద్ధమైన నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ క్షేత్రంలో శనివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాల సందడి నెలకొంది. వివిధ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దంపతులు సత్యనారాయణస్వామి వ్రతమాచరించి మొక్కులు తీర్చుకున్నారు. క్షేత్రంలో 27 వ్రతాలు,13 అభిషేకాలు, 30 సేవలు జరిగినట్లు ఆలయ అధికారులు తెలిపారు. – వర్గల్(గజ్వేల్)



నాచగిరిలో వ్రతమాచరిస్తున్న దంపతులు

ఫోన్ ట్యాపింగ్‌తో తెలంగాణకు మచ్చ

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

హుస్నాబాద్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తెలంగాణకు మాయని మచ్చగా మారిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ గీతం, చిహ్నం మార్పు విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మిత్రపక్షాలతో చర్చించారన్నారు. వాస్తవాల దిశగా గీతాన్ని రూపొందించాలన్నారు. సాయుధ పోరాట యోధులు లేనిదే తెలంగాణ లేదని, వారిని మరువొద్దన్నారు. పదేళ్లలో కేసీఆర్ ఉద్యమ హామీలు ఏ ఒక్కటి అమలు చేయలేదని ఆరోపించారు. దశాబ్ది ఉత్సవాలకు సోనియాగాంధీని ఆహ్వానించడం మంచిదేనన్నారు. పార్లమెంట్‌లో బిల్లును ఆమోదించడంలో సోనియా ప్రత్యేక భూమిక పోషించించారని కొనియాడారు. గత ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ ద్వారా రూ. వందల కోట్లు సంపాదించిందన్నారు. రాష్ట్రంలో అవినీతి రహిత పాలన అందించాలని ప్రభుత్వానికి సూచించారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అశోక్, గడిపె మల్లేశ్, నాయకులు సంజీవరెడ్డి, సుదర్శనచారి, రాజ్‌కుమార్, మల్లారెడ్డి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

చాళుక్యుల కాలం నాటి వీరగల్లు గుర్తింపు



మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని వంగపల్లిలో చాళుక్యుల కాలం నాటి అపూర్వమైన వీరగల్లును పురాతన పరిశోధకుడు రత్నాకర్‌రెడ్డి శనివారం గుర్తించారు. గ్రామంలోని బురుజు వద్ద చాళుక్యుల కాలం నాటి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ విగ్రహంపై వేట కుక్కల సహాయంతో అడవి పందుల నుంచి పంట చేలను ఎలా కాపాడు కోవాలో తెలిపే ఆనవాళ్లు ఉన్నాయని తెలిపారు. వీరగల్లును స్థానికులు కాపాడుకోవాలని సూచించారు.

రాజీమార్గంతో పరిష్కారం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి



మాట్లాడుతున్న సాయి రమాదేవి

సిద్దిపేటకమాన్: జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకోదగిన క్రిమినల్ కేసులను పరిష్కరించేలా చూడాలని న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి కోరారు. సిద్దిపేట కోర్టులో శనివారం జిల్లా ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజర్స్ స్టాండింగ్ కౌన్సిల్స్, చిట్ ఫండ్ కంపెనీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ చేయాలన్నారు. న్యాయమూర్తులు స్వాతిరెడ్డి, మిలింద్‌కాంబ్లి, శ్రావణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటలింగం, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాధాకృష్ణ, సిద్దిపేట ఏసీపీ మధు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం వద్ద 144సెక్షన్ : సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: జిల్లాలో పదోతరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు జరుగనున్న పరీక్ష కేంద్రం వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందని సీపీ అనురాధ తెలిపారు. ఈ నెల 3నుంచి 13వరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రం సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసి వేసి ఉంచాలని తెలిపారు.

'అవతరణ'కు ఏర్పాట్లు

మిరుదొడ్డి(దుబ్బాక): తెలంగాణ అవతరణ ఉత్సవాలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్యాలయాలను ముస్తాబు చేశారు. ఆదివారం ప్రభుత్వ కార్యాలయాలతోపాటు పంచాయతీల వద్ద ప్రత్యేక పాలనాధికారులు జాతీయ జెండాలను ఎగురవేయనున్నారు. కొండాపూర్‌లో ఉన్న అమరవీరుల స్తూపాన్ని పంచాయతీ కార్మికులు శుభ్రం చేశారు.

'అధిక సాంద్రత'తో అధిక లాభాలు



రైతులకు విత్తనాలు అందజేస్తున్న అధికారులు

మర్కూక్(గజ్వేల్): అధిక సాంద్రత పద్ధతిద్వారా పత్తి సాగుచేస్తే అధిక లాభాలు సాధిస్తారని ములుగు డివిజన్ ఏడీఏ అనిల్‌కుమార్, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు విజయ్, పల్లవి పిలుపునిచ్చారు. స్థానిక రైతు వేదికలో శనివారం పత్తిపంటపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం కూలీల కొరత రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని, పెట్టుబడులు పెరిగి చిన్న,సన్నాకారు రైతులు నష్టపోతున్నారని వాపోయారు. వాటిని అధికమించేందుకు కొంతమంది రైతులు వరిసాగులో వెదజల్లే పద్ధతి వైపు మొగ్గు చూపుతున్నారని చెప్పారు. అలాగే అధిక సాంద్రత విధానం ద్వారా పత్తి సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు. రైతులకు ఉచితంగా విత్తనాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఓ నాగేందర్‌రెడ్డి, నూజీవీడు ప్రతినిధి నర్సింహారెడ్డి, ఏఈఓలు విష్ణువర్ధన్, భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

'బడిబాట'ను విజయవంతం చేయాలి

నంగునూరు(సిద్దిపేట): ఈనెలలో నిర్వహించే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంఈఓ యాదవరెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం నంగునూరులో ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మన్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 3నుంచి 19వరకు జరిగే బడిబాట విజయవంతానికి అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. బడిబయట పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వేణుగోపాల్, తహసీల్దార్ అనిల్ కుమార్, నోడల్ ఆఫీసర్ ప్రభాకర్‌రావు, ఏఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్, లింగం తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట)లో..

బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ లింగాల నిర్మల సూచించారు. బెజ్జంకి మండల పరిషత్ కార్యక్రమంలో శనివారం బడిబాట సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నిర్మల మాట్లాడులూ బడిబాట కార్యక్రమంలో స్థానిక అధికారులు పాల్గొని బడి ఈడు పిల్లలను బడిలో చేర్పాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మప్ప, ఎంఈఓ పావని, ఎంపీఓ విష్ణు, ఎంపీఎం నర్సయ్య, వివిధశాఖల అధికారులు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



నంగునూరు(సిద్దిపేట): మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంఈఓ యాదవరెడ్డి

డీసీసీబీ సేవలు విస్తృత పరుస్తాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

చిన్నకోడూరు(సిద్దిపేట): డీసీసీబీ అందించే సేవలను ఇంటింటికీ విస్తృత పరుస్తామని బ్రాంచ్ మేనేజర్ శ్రావణ్ కుమార్ తెలిపారు. శనివారం చిన్నకోడూరులో బ్యాంకు సేవలకు చెందిన పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజులపాటు అన్ని గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ప్రజల అభిప్రాయాలను సేకరిస్తామని, డిపాజిట్ చేసిన వారికి ఏడాదిపాటు రూ.2లక్షలు నుంచి 4 లక్షల వరకు ఉచిత బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. పది ఏళ్లలోపు పిల్లలకు సహకార 'బచ్‌పన్ భరోసా డిపాజిట్ స్కీం' ప్రవేశపెట్టినట్టు తెలిపారు. ఆయన వెంట బ్యాంక్, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హనుమాన్ మాలధారణ దీక్షను విరమిస్తున్న స్వాములు



ములుగు(గజ్వేల్): పూజ చేస్తున్న రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి దంపతులు

• జై హనుమాన్..

జిల్లా వ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత భవంగా కొనసాగాయి. శనివారం ఉదయం నుండే హనుమాన్ ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయ స్వామి మూల విరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించారు. హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. హనుమాన్ మాలధారణ స్వాములు తమ దీక్షలను విరమించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



చిన్నకోడూరు(సిద్దిపేట): హోమం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ దంపతులు

హత్యకు దారితీసిన వివాహేతర సంబంధం

వివరాలు తెలిపిన ఏసీపీ పురుషోత్తంరెడ్డి

గజ్వేల్‌రూరల్: వివాహేతర సంబంధం హత్యకు దారితీసింది. తల్లితో పాటు కూతురిపై కూడా కన్నేశాడనే అనుమానంతో ఆ వ్యక్తిని అడ్డు తొలగించుకోవాలని వారిద్దరూ పథకం పన్నారు. ఇంట్లోకి వచ్చిన అతడిని గొంతు నులిమి హత్యచేసి నిందితులు తప్పించుకుపోవడంతో ఈ ఘటన సంచలనంగా మారింది. గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌కు చెందిన జమాల్‌పూర్ సోనీబాయి–హరిలాల్(ప్రకాశ్)కు కొడుకు కిషోర్, కూతురు ఉన్నారు. కరోనా సమయంలో హరిలాల్ మృతి చెందడంతో ఆస్తి విషయంలో కుటుంబ సభ్యులతో గొడవలు నెలకొన్నాయి. ఆ సమయంలో సోనిబాయికి ఎదురింట్లో ఉండే నరేష్‌తో వివాహేతర సంబంధం ఏర్పడింది. అతడు ఆమె కూతురుపై కూడా కన్నేశాడని, తరచూ గొడవ పడుతుంటే అతడి అడ్డు తొలగించుకోవాలని పథకం వేసింది. ఆ వివరాలను గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి శనివారం వెల్లడించారు. సోనిబాయి, ఆమె కుమారుడు కిషోర్ శనివారం గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోవడంతో గజ్వేల్ సీఐ సైదా వారిని అరెస్టుచేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. నరేష్ హత్యకు అక్రమ సంబంధమే కారణమని దర్యాప్తులో వెల్లడైందన్నారు. సోనిబాయితో పాటు ఆమె కుతురుపై కన్నేయడంతోనే నరేషను అడ్డు తొలగించుకోవాలని పథకం పన్ని, మద్యం తాగి ఇంట్లోకి వచ్చిన నరేష్ గొంతు నులిమి, తర్వాత చీరతో ఉరివేసి హత్యచేసినట్లు సోనిబాయి, కొడుకు కిషోర్ అంగీకరించినట్లు ఒప్పుకున్నారని ఏసీపీ పురుషోత్తంరెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు.

కారు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లి రాజీవ్ రహదారిపై కారు–హార్వెస్టర్ ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడినట్టు ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు. సునీల్ కుమార్ తన భార్య వనిత, కుమారుడు వేదాన్స్‌లతో కలిసి హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపునకు కారులో వెళుతుండగా తోటపల్లి గ్రామం నుంచి వస్తున్న హార్వెస్టర్ వారిని ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న వారు గాయపడ్డారని, హార్వెస్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

మంత్రి పొన్నంకు ఘన స్వాగతం

కోహెడరూరల్(హుస్నాబాద్): రాష్ట్ర రావాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ విదేశీ పర్యటన ముగించుకొని తిరిగివచ్చిన సందర్భంగా కాంగ్రెస్ మండల నాయకులు హైదరాబాద్‌లో ఆయకు ఘనస్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య, సీనియర్ నాయకులు శెట్టి సుధాకర్, వెంకటస్వామి, బాలకిషన్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



పొన్నం ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

చెత్తాచెదారం తొలగించారు..

సాక్షి ఎఫెక్ట్..

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల కేంద్రంలో 'అంతటా దుర్గంధం'.. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు అనే శీర్షికన శనివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఎంపీడీఓ భానోతు జయరాం, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంతరావు స్పందించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, రైతు వేదిక ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్త,చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను పంచాయతీ కార్మికులు తొలగించారు. దుర్గంధం వెదజల్లకుండా ప్రత్యేక చర్యలు చేపడతామని పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంతరావు పేర్కొన్నారు.



పరిసరాలను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కుదిరిన సహకార ఒప్పందం



ఒప్పంద పత్రాలను చూపుతున్న అధికారులు

ములుగు(గజ్వేల్): ములుగు కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం, సిద్దిపేట జిల్లా ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్–నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్(ఐసీఎంఆర్–ఎన్‌ఐఎన్)ల మధ్య శనివారం సహకార ఒప్పందం కుదిరింది. ములుగు విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ నీరజ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ తరఫున డాక్టర్. వెంకటేశ్, డాక్టర్.సిల్వియా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ ఒప్పందం ఆరోగ్య సమస్యలను పరిష్కరించడం, స్థిరమైన ఉద్యాన పద్ధతులను ప్రోత్సహించడంలో ప్రయోజనం చేకూర్చే విధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధికారులు భగవాన్, రాజశేఖర్, విజయ, శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల నిర్ణయాన్ని ఆపాలంటూ వినతి

సిద్దిపేటరూరల్: ఆశా వర్కర్లకు పరీక్షలు పెట్టే నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ ఆశావర్కర్ల జిల్లా గౌరవ అధ్యక్షుడు భాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మట్లాడుతూ రాష్ట్రంలో ఆశా వర్కర్లు ఎన్నో సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. రిజిస్టర్స్ రాయడం, సర్వేలు చేయడం, ఆన్లైన్ చేయడం, బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర జబ్బులను గుర్తిస్తున్నారన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో వారి సేవలు ఎంతో అభినందనీయమని, ఇన్ని పనులు చేస్తున్న ఆశా వర్కర్లకు మళ్ళీ కొత్తగా ఎగ్జామ్స్ నిర్వహించి వారిని మళ్లీ నిరూపించుకునేలా చర్యలు చేపట్టడం దారుణమని వాపోయారు. కార్యక్రంలో రవి కుమార్. మంజుల, ప్రవీణ, శ్యామల, వసంత తదితరులు పాల్గొన్నారు.



ఏఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న భాస్కర్ తదితరులు

కుట్టు పనులు త్వరగా పూర్తి చేయాలి



మహిళలతో మాట్లాడుతున్న అధికారులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): విద్యార్థులకు అందించే యూనిఫాం కుట్టు పనులు త్వరగా పూర్తిచేయాలని డీఆర్డీఓ పీడీ జయదేవ్ ఆర్య సూచించారు. శనివారం మండలంలోని తిగుల్, పలుగుగడ్డ, మందాపూర్ గ్రామాల్లో మహిళ సంఘం సభ్యులు కుడుతున్న దుస్తులను పరిశీలించారు. ఈ నెల 3 వరకు దుస్తుల కుట్టే పనులు పూర్తి చేయాలని, పాఠశాలలు పునః ప్రారంభానికి ముందు పాఠశాలలకు అందించాలని చెప్పారు. అలాగే చాట్లపల్లి పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను, ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీల సంఖ్యను పెంచాలని, పెండింగ్‌లో ఉన్న కూలీల వేతనాలు త్వరలోనే వారి ఖాతాలో జమ చేస్తారన్నారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల జిల్లా కో ఆర్డినేటర్ రామస్వామి మాట్లాడారు. ఎంపీడీఓ యాదగిరి, ఎంపీఓ శ్రీనివాస్‌వర్మ, వీఓఏలు పాల్గొన్నారు.


'అమ్మ ఆదర్శ' పనుల పరిశీలన

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఉన్న తాడూరు, చిట్యాల, దానంపల్లి, కమలాయపల్లి, అర్జున్‌పట్ల, ఆకునూరు పాఠశాలల్లో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను శనివారం డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే సమయానికి పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి, పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీ కనకరాజు తదితరులున్నారు.



పనులు పరిశీలిస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

Telangana Formation Day Greetings
To All Siddipet Dist. People, Students and well-Wishers
మా స్కూల్ విద్యార్థినికి నేషనల్ లెవెల్‌లో కన్సోలేషన్ ప్రైజ్, స్టేట్ లెవెల్ విన్నర్‌గా, డిస్ట్రిక్ట్ లెవెల్ ఛాంపియన్‌షిప్ గ్రహీతగా & ఇద్దరు విద్యార్థినులకు కన్సోలేషన్ ప్రైజెస్ గెలుచుకున్నారు. గత సంవత్సరంలోనే అబాకస్, ఇంగ్లీష్ ఎక్స్‌ప్రెసివ్ లాంగ్వేజ్ ల్యాబ్ ప్రారంభించాము. మా పిల్లలు అన్నింటిలోనూ రాణించారు. కనుక వెంటనే మా స్కూల్‌లో మీ పిల్లలను చేర్పించండి.. స్కూల్ ఫీజులు మీకు అందుబాటులోనున్నవి. విశ్వసించండి. మీ పిల్లలకు మంచి గొప్ప విద్య మా స్కూల్‌లో లభించును.



STEPHEN'S HIGH SCHOOL (E.M.)
NURSERY to CLASS X
Gadicherlapally, Near Bypass Road
SIDDIPET. Ph: 9346114183, 7093532750

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990